క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఒకటో పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో శక్తి కేంద్ర ప్రముఖ్ కండ్రిగ ఉమ ఆధ్వర్యంలో పోలింగ్‌బూత్ 107, 108, 109, 110 బూత్ అధ్యక్షులు, సభ్యులతో బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఊరేగింపు



శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ ఆలయంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని కృష్ణ భగవానుడిని పురవీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ కృష్ణుడి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి భజన కార్యక్రమం జరిగింది. భక్తులు వేసిన పండరీ భజన ఆకట్టుకుంది. భారీస్థాయిలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తూర్పు దళితవాడలో పడకేసిన పారిశుధ్యం



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం తూర్పు దళితవాడలో పారిశుధ్యం పడకేసింది. రోడ్డుకిరువైపులా చెత్త చెదారాలు నిండిపోయాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు రోడ్డు పక్కన పడేయడంతో దుర్వాసన వస్తూ డంపింగ్‌యార్డును తలపిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న విద్యార్థులు, మహిళలు దుర్వాసన భరించక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరారు.

ఆనందంతో ఆరోగ్యం



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న హెచ్‌ఎం

ఏర్పేడు: ఆనందంతో ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని పల్లం హైస్కూల్‌లో మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జానపద గేయాల పోటీలు నిర్వహించారు. జానపద గీతాలు, తెలుగుజాతి, భక్తి భజన పాటలు, కోలాటాలు, పండరి భజన, చెక్కభజన పాటలు పాడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, పుష్పవాణి, వెంకటరమణ, బాలసుబ్రమణ్యం, వాణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామాలయంలో సెప్టెంబర్‌లో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. 3న అమావాస్య సందర్భంగా ఉదయం 6 గంటలకు సహస్ర కలశాభిషేకం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ జరుగనుంది. అలాగే ఈనెల 7, 14, 21, 28 తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. ఇదే రోజు సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడవీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థానం చేపడతారు.

సేవే శ్వాసగా..!



మాట్లాడే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అంటూ మదర్ థెరిస్సా చూపిన బాటలో పయనిస్తోంది ఆమె. తాను దివ్యాంగురాలైనప్పటికీ పలువురు అభాగ్యులకు తన వంతు సాయం చేస్తూ ప్రశంసలు పొందుతోంది. సేవ చేయాలన్న తలంపుతో దాతల సహకారంతో ముందుకు సాగుతోంది. మానవ జీవితం ఉత్తమమైందని.. మళ్లీ మళ్లీ రాదని అనాథలు, దివ్యాంగులు, వృద్ధుల సేవలో తరిస్తోంది దివ్యాంగురాలు సైదమ్మ.

- అభాగ్యుల సేవలో తరిస్తున్న సైదమ్మ
- 39 మంది దివ్యాంగులు, అనాథలు, వృద్ధులకు ఆశ్రయం

ఆమె సేవలపై ఆదివారం ప్రత్యేక కథనం.



అనాథలు, దివ్యాంగులు, వృద్ధులతో సైదమ్మ

ఏర్పేడు: సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెం మండలం, దొండపాడు గ్రామానికి చెందిన సైదమ్మ పుట్టుకతో దివ్యాంగురాలు. ఈమె తల్లిదండ్రులు పుట్టా నరసింహరావు, ఆదిలక్ష్మి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈమె ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు కోదాడలో చదివింది. ఓపెన్ వర్సిటీలో బీఏ చేసింది. భవిష్యత్తులో మానసిక ఇబ్బందులు, ఎన్నో కష్టాలు, బాధలు అనుభవించింది. కుటుంబాన్ని వదిలి తమతోటి దివ్యాంగులు, అనాథలు, వృద్ధులను ఆదరిద్దాం..అక్కున చేర్చుకుందాం అనే నినాదంతో ఏర్పేడు మండలంలోని వికృతమాల నీలాద్రినగర్‌లో శ్రీలక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి, సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వారికి ఉచితంగా భోజనం, వసతి, వైద్య సేవలు అందిస్తున్నారు. 2023లో వికృతమాల నీలాద్రినగర్‌లో నాలుగు అద్దె గదుల్లో ట్రస్టు ప్రారంభించి, 29 మంది అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు ఆశ్రయం కల్పించింది. ప్రస్తుతం 39 మంది ఆ ట్రస్టులో ఆశ్రయం పొందుతున్నారు.

అక్షయక్షేత్రం స్ఫూర్తితో..

సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెం మండలం, దొండపాడు గ్రామానికి చెందిన సైదమ్మ ఐదేళ్ల ముందు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చింది. స్వామివారి దర్శనానంతరం శ్రీవారి ప్రసాదాల కౌంటర్ వద్దకు వెళ్లింది. అక్కడ తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలోని అక్షయక్షేత్రంలోని మానసిక వికలాంగులు తయారు చేసిన బ్యాగులు విక్రయిస్తుండగా చూసింది. వాటి గురించి అరా తీసి, తాను పలువురికి సేవ చేయాలన్న భావనతో తిరిగి ఇంటికి వెళ్లకుండా అక్షయక్షేత్రానికి వెళ్లింది. అక్కడే ఐదేళ్ల పాటు మానసిక వికలాంగులకు సేవలందించింది. అనంతరం 2023లో ఏర్పేడు మండలం వికృతమాల నీలాద్రినగర్‌లో తను సొంతంగా సేవలు ప్రారంభించి, కొనసాగిస్తోంది.

దాతల సహకారం

అభాగ్యులకు సేవలు అందించడం కోసం శ్రీలక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసింది. దీనికి దాతల సహకారం మెండుగా లభించింది. పలువురు దాతలు ట్రస్టును సందర్శించి తమ వంతు సాయం అందజేస్తున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సహకారం అందిస్తూ.. మీకు తోడుగా మేము న్నాం అంటూ భరోసా కల్పిస్తున్నారు. నిత్యావసర సరుకులు, నూతన దుస్తులు, బియ్యం అందిస్తున్నారు. అలాగే ట్రస్టులోని అభాగ్యులకు పుట్టిన రోజు, పెండ్లి రోజు తదితర శుభకార్యాలు నిర్వహిస్తూ వారికి చక్కటి భోజనాన్ని అందిస్తూ, వసతి కల్పిస్తున్నారు.



వృద్ధునికి ప్రథమ చికిత్స చేస్తున్న సైదమ్మ

అంత్యక్రియల బాధ్యత కూడా..

ఉమ్మడి చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన అనాథలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఎవరైనా అనాథలు, దివ్యాంగులు, వృద్ధులు మృతి చెందితే వారి దహన సంస్కారాల బాధ్యత కూడా తనదేనని సైదమ్మ అంటున్నారు. ఆమె సేవలను గుర్తించిన సర్ రామన్ అకాడమీ 2024 సంవత్సరం ఫిబ్రవరి 4న మహిళా సేవారత్న అవార్డును ప్రదానం చేసింది.

లాభాపేక్షలేకుండా..



లాభాపేక్షలేకుండా సేవ చేస్తున్నా. నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. నా చిన్నతనం నుంచి కష్టాలు ఎదుర్కొన్నాను. నాలాంటి వారికి సేవ చేయాలనే ఆలోచనతో ట్రస్టు ఏర్పాటు చేసి పలువురిని ఆదుకుంటున్నాను. ఎలాంటి ఆధారం లేని వారికి ట్రస్టులో ఆశ్రయం కల్పిస్తున్నాను. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి.
–సైదమ్మ, వ్యవస్థాపకురాలు, శ్రీలక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు

ఎవరూలేని అనాథను



నా వయస్సు 71 సంవత్సరాలు. భార్య మృతి చెందడంతో అనాథను అయ్యాను. ఒకటిన్నర సంవత్సరం కిందట రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఉండగా పోలీసులు గుర్తించి ఇక్కడకు చేర్చారు. అప్పటి నుంచి ఇక్కడ భోజనం, వసతి, మందులన్నీ ఉచితంగా అందిస్తున్నారు. మాది తమిళనాడు రాష్ట్రం, చెన్నై రెడ్‌హిల్స్. ట్రస్టు నిర్వాహకురాలు సైదమ్మ ఆదరణ చాలా బాగుంది.
–పన్నీరు సెల్వం, అనాథ

పట్టించుకోలేదు



నాది తిరుపతి జిల్లా గూడూరు. నా వయస్సు 90 ఏళ్లు. భర్త 40 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఉన్న ఒక్క కుమారుడు పట్టించుకోలేదు. దీంతో ఒకటన్నరేళ్ల క్రితం రైలు ఎక్కి తిరుపతి రైల్వేస్టేషన్‌లో దిగాను. అక్కడ ఉండగా కొద్ది రోజుల అనంతరం పోలీసులు ఇక్కడకు తీసుకుని వచ్చి వదిలారు. కుమారుడున్నా పట్టించుకోలేదు. ఇక్కడ బాగా చూసుకుంటున్నారు.
–ఇంద్రాణి, అభాగ్యురాలు

'చలో తిరుపతి కలెక్టరేట్'ను విజయవంతం చేయండి

ఏర్పేడు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆదివారం జరిగే చలో తిరుపతి కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ తిరుపతి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మడి మురళి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్టీయూ రాష్ట్ర పిలుపు మేరకు ప్రభుత్వం సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను మాత్రమే అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2004 సెప్టెంబరు ఒకటిన సీపీఎస్ అమలు చేసిన రోజును పురస్కరించుకుని ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా, డివిజన్, మండల నాయకులు, సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

శ్మశానాల్లో వసతులు కల్పిస్తాం

సత్యవేడు: గ్రామాల్లోని శ్మశానాలకు వెళ్లేదారులకు స్థలం లేకున్నా కొనుగోలు చేసి అయినా సరే చివరి మజిలీకి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం సత్యవేడు మండలంలోని వీఆర్ కండ్రిగ పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు తమ పంచాయతీలోని దళితులకు శ్మశానానికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. రెవెన్యూ అధికారులు స్థలం పరిశీలించాలని ఆదేశించారు. స్థలం లేకున్నా భూమి కొనుగోలు చేసి ఇచ్చేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేశారు. అంతకు ముందు ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు బీకే అరుణ, బీకే శాంతి ఎమ్మెల్యేకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ సుజాత, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ పార్టీ అధ్యక్షుడు వీకేఎస్ పరమశివం(బాషా), ఆడిటర్ రోశయ్య, బాల మురళీకృష్ణ, లోకయ్యరెడ్డి, సుబ్రమణ్యంరాజు, మురళి, మోహన్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్టువ్యాధి రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి దివాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని కాటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం కుష్టువ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలు, నిర్ధారణపై వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందంగా మెరిసే జిడ్డు గల చర్మం, బత్తాయి తొక్కలాగ ఉండడం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కన్నురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మర్లు వంటి అనుమానిత లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ఉచితంగా ఎండీటీ మందులను పంపిణీ చేస్తున్నామన్నారు.

కొత్త పాఠశాల ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో కొత్త పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 2004లో అప్పటి ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు 14వేల ఇళ్ల పట్టాలు, మాజీ మంత్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 2014లో 6,700 టిడ్కో ఇళ్లు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జగనన్న కాలనీ పేరుతో 2 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. కైలాసగిరి పర్వతం చుట్టూ సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయడంతో రాజీవ్‌నగర్ మరో శ్రీకాళహస్తిగా మారిందన్నారు. అప్పట్లో ఈ ప్రాంతంలో పార్కులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు కేటాయించినా నేటి వరకు నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఇక్కడి పిల్లలు అటు శివనాథపురం, ఇటు బంగారమ్మగుడి ప్రాంతానికి రావాల్సి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని రాజీవ్‌నగర్‌లో కొత్తగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనం, కొత్త రోడ్డు, స్థానిక సమస్యలను పరిష్కరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఈఓపీఆర్డీ సేవలు అభినందనీయం

సత్యవేడు: మండల కేంద్రంలో ఈఓపీఆర్డీగా పనిచేసిన రాఘవేంద్రరెడ్డి సేవలు అభినందనీయమని సత్యవేడు ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సత్యవేడులో ఈఓపీఆర్డీ, తిరుపతి ఎంపీ గురుమూర్తి ఇన్‌చార్జి పీఏగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఆయన్ని పంచాయతీ అధికారులు, ఎంపీడీఓ సిబ్బంది, ఎంఈఓ, సర్పంచ్‌లు సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పి. విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కే. చంద్రశేఖర్ రెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్ రెడ్డి, ఎంఈఓ కే.రవి, పంచాయతీయతీ కార్యదర్శి మునిరవికుమార్ శాలువాలు కప్పి సత్కరించారు. శివయ్య రెడ్డి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఈఓపీఆర్డీ రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీవైఈఓ బాలాజీ

ఏర్పేడు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీవైఈఓ బాలాజీ అన్నారు. శనివారం మండలంలోని బండారుపల్లి హైస్కూల్‌లో రికార్డులు, సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్ష పేపర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పెంచాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవలతోనే సంతృప్తి

- 160 మంది కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న డీఎం రాజవర్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సేవ చేయడంలోనే ఎంతో సంతృప్తి ఉందని శ్రీకాళహస్తి ఆర్టీసీ డీఎం వై.రాజవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఆయన్ని కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్, గ్యారేజ్ సిబ్బంది గజమాలతో సత్కరించారు. అయితే ఆయన ఆర్టీసీలో పనిచేస్తున్న 160 మంది పారిశుధ్య కార్మికులతోపాటు బస్టాండ్ వద్ద ఉన్న పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన శక్తి మేరకు ఎదుటి వారికి సాయం చేయడంలో ఉండే సంతృప్తి ఎందులోనూ లేదన్నారు. 33 ఏళ్ల పాటు ఆర్టీసీలో వివిధ హోదాల్లో ఉద్యోగం చేసి ఎంతో సంతృప్తిగా ఉద్యోగ విరమణ పొందుతున్నానని చెప్పారు. శ్రీకాళహస్తి డిపో అభివృద్ధికి నాలుగేళ్లపాటు ఆయన చేసిన కృషిని కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్ కొనియాడారు.

ఘనంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా తైలాభిషేకం చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి విశేషాలంకరణ, పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా శనిత్రయోదశి ప్రదోష పూజలు



పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయంలోని నందీశ్వర స్వామి, వాల్మీకేశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ప్రసాదాల వితరణకు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

- కమీషన్లకు కక్కుర్తి
- గ్రామస్తుల ఫిర్యాదుతో రాజీనామా
- రికవరీ చేయాలని డిమాండ్

శ్రీకాళహస్తి: మండలంలోని అమ్మపాళెంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంతో ప్రభుత్వానికి భారీగా గండి పడింది. యంత్రాలతో పనిచేయిస్తూ కొలతలు పెంచి రాయించుకుని లబ్ధిదారుల వద్ద కమిషన్ తీసుకుని కొంతమందిని వేలిముద్రలు వేయించి.. డబ్బులు వస్తాయని మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల ఫిర్యాదుతో ఆమె తానేమీ ఎరగనట్లు రాజీనామా చేసి వెళ్లిపోయింది. అమ్మపాళెంలో ప్రైవేటు జాబ్‌లు చేసుకునేవారు, అంగన్‌వాడీ కార్యకర్తలు సైతం ఉపాధిహామీ కూలీలుగా చూపించి, డబ్బులు దండుకున్నారు ఓ ఫీల్డ్ అసిస్టెంట్. 35మందిని మస్టర్లలో చూపించి 15మందితో పనులు చేయించి, మిగిలిన పనిని యంత్రాలతో చేసి చేతులు దులుపుకున్నారు. ఒకరికి రూ.200 నుంచి రూ.300 నగదు రూపంలో ఉపాధి పేరుతో 20 మందికి సంబంధించి ఒకరోజుకు సుమారు రూ.6వేలు, నెలకు రూ.1.80 లక్షలు వంతున మూడు నెలల్లో సుమారు రూ.6 లక్షలు వరకు కాజేశారు. జాబ్‌కార్డు ఉండి పనికిరాని వారి వద్ద వచ్చిన డబ్బుల్లో కమీషన్‌గా ఇస్తే వారు పనికి రాకపోయినా పనిచేసినట్లు మస్టర్ రాసుకుంటున్నారు. కొంత మందికి తమ జాబ్‌కార్డు ఉందనే విషయం తెలియకుండానే వేలిముద్రలు పెట్టాలని మోసగించి వారికి రూ.100, రూ.200 ఇచ్చిన డబ్బులు దండుకున్నట్లు గ్రామస్తులకు తెలియడంతో వారు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ చర్యలు తీసుకోవడానికి ఉపక్రమిస్తున్న నేపథ్యంలో తాను రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించి వెళ్లిపోయింది. ఇంత జరుగుతున్నా ఏపీఓ పర్యవేక్షణ లేకపోవడం బాధాకరమని పలువురు అనుకుంటున్నారు. అయితే సోషల్ ఆడిట్‌లో దీనిపై ఏపీఓ దినేష్‌ను వివరణ కోరగా ఆమె రాజీనామా చేసిందని, సోషల్ ఆడిట్‌లో పనిచేసిన వారిని విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్ఐ సేవలు అభినందనీయం

వరదయ్యపాళెం: మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న వేణుగోపాల్ సేవలు అభినందనీయమని తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ఆర్‌ఐ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం రెవెన్యూ కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు ఆర్‌ఐ వేణుగోపాల్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆయన నిబద్ధత ఎనలేనిదని కొనియాడారు. ఆర్‌ఐ మాట్లాడుతూ మండలంలో ప్రజల ఆదరణ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, విశ్రాంత తహసీల్దార్ యుగంధర్, ఈఓపీఆర్డీ చిరంజీవి, సీనియర్ అసిస్టెంట్ మురళి, వీఆర్వోలు రవిరెడ్డి, మధుసూదన్, చలపతి, అనీబ్, నాగేంద్ర, మాధవి, సుగుణ, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఐని సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

పేదల ఇళ్లపై కూటమి కన్నెర్ర

- వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి కట్టడాల కూల్చివేతకు సన్నాహాలు
- టీడీపీ నేతల అత్యుత్సాహంపై విస్తుబోతున్న పట్టణవాసులు



శ్రీకాళహస్తి : నిరుపేదల ఇళ్లపై కూటమి నేతలు కన్నెర్ర చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి కక్ష తీర్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఆక్రమిత స్థలాల్లో కట్టడాలంటూ కూల్చివేతకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే రోడ్డు పోరంబోకు, కాలువ పోరంబోకు పేరుతో వందకు పైగా వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పడగొట్టేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో మొత్తం కూల్చేశారు. ఇపుడు మళ్లీ 50 బృందాలతో రాజీవ్‌నగర్‌లో సర్వే చేపట్టి పేదలను భయాందోళనకు గురి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పేదలను లక్ష్యంగా పెట్టుకుని కూల్చివేతలకు రంగం సిద్ధం చేశారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఉన్నపుడు కొండమిట్ట, దుర్గమ్మ తిప్ప, కుమారస్వామి తిప్ప, నారదపుష్కరణిలో చుట్టుపక్కల, ముత్యాలమ్మ గుడివీధి, దోబీఘాట్, పానగల్ బాలాజీకాలనీ, అయ్యలనాయుడుచెరువు, చెంచులక్ష్మికాలనీ, గోపాలకృష్ణారెడ్డి కాలనీ, విశాలాక్షి నగర్ ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు,మద్దతుదారులు యథేచ్ఛగా స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే తర్వాత ఎమ్మెల్యేలుగా గెలిచిన ఎస్సీవీనాయుడు, బియ్యపు మధుసూదన్‌రెడ్డి వాటిని తొలగించలేదు. కక్షసాధింపులకు పాల్పడకుండా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పించారు.. కొంతమందికి పార్టీలకు అతీతంగా పట్టాలు కూడా పంపిణీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఇచ్చిన స్థలాలపై ఆక్రమణల పేరుతో దాడులు నిర్వహించి నిర్మాణాలను తొలగించారు. విష్ణుకెమికల్స్ సమీపంలో రోడ్డు పక్కన తాత్కాలిక షెడ్లలో చిరువ్యాపారాలు చేసుకుంటున్న పేదల దుకాణాలను కూలగొట్టారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా శుక్రవారం 50 బృందాలతో రాజీవ్‌నగర్ సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. ఆక్రమణను కచ్చితంగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఇదేం అన్యాయం



సుమారు 15 ఏళ్లుగా రాజీవనగర్‌లో ఉన్న నా స్థలంలో వేసిన పునాదులను కూల్చివేయడం బాధ కలిగించింది.ఒరిజనల్ పట్టాలను నా దగ్గరే ఉన్నాయి. ఎవరు వచ్చినా పరిశీలించుకోవచ్చు. అయినప్పటికీ టీడీపీ నేతలు దుర్మార్గంగా మా ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు.
– బషీరా, బాధితురాలు

నా ఇల్లు కూల్చివేశారు



రాజీవ్‌నగర్‌లో నాకు ఇచ్చిన స్థలంలో ఇంటిని నిర్మించుకున్నా. ఆక్రమించుకున్నానంటూ ఇంటిని పడగొట్టారు. వైఎస్సార్‌సీపీలో పనిచేశానని కక్షసాధిస్తూ టీడీపీకి చెందిన కొందరు నాకు ఇల్లు లేకుండా చేశారు. నా వద్ద ఒరిజనల్ పట్టా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా ఇంటిని పడగొట్టడం బాధాకరం.
– షర్మిలా ఠాగూర్, బాధితురాలు